# పల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకథలు



పొద్దుగుంకతా వుండంగా ఆవుల మందలు తోలుకుంటా వస్తా వుండారు మా గూడెం కుర్రోల్లు. ఆవులు, బర్రెలు గుంపుగా నడస్తా వుంటే ఆడంతా ఎర్రమట్టి మొగిలు మాదిరి పైకి లేస్తుండది.

# రెప్పల మీన రూపాయి

దాని తట్టు సూస్తా వుంటే కంటికింపుగా వుంద వైపే నేనట్టనే సూస్తుండా. గొడ్లుగాసే కుర్రోల్లు యములు మాదిరి దున్నలెక్కి వోటిల్ని కర్రల్తో చరస్తా పరుగుల్దీయిస్తా వుండరు.

ఆ గొడ్ల మంద యెనగ్గా, పన్లకి బొయ్యనొల్లు పారలు, గంపలూ బుజానేసుకోని నడుసుకుంటా వస్తావుండారు. వోల్లల్లో ఎవురో వొకాయన్ని యాన్నో సూసినట్టు గ్యేపకానికొచ్చింది. రొంచేవు ఆలోశన జేసినాక మతికొచ్చింది. ఆయన మా నాగయ్య మామ. ఎన్నో యాల్లకి సూస్తిని. అందుకనే సూడంగనే తెలియలా!

నాగయ్య మామ మాత్తరం నన్ను జూడంగానే గుర్తుబట్టి పలకరిచ్చినాడు.

"యాందయ్యా! వొచ్చినాల ముంచి ఈన్నే వుండా వంటనే? మావూరు కొచ్చెర్లకోటకి రాగో దదా?" అన్నాడు. నిస్టూరం జేస్తా.

నేను నవ్వి గమ్ముమున్నా. మామ కాల్లుసేతులు కడిగి నాకాడ కూసున్నడు. కండవతో మొకం తుడుకుంటా నన్ను పలకరిచ్చుకుంటున్నాడు.

**ఎండ్లూరి సుధాకర్**

శాంతమ్మ స్టీలు గలాసుల్తో అంత కాపీ సుక్కిస్తే తాగతా వుండాము.

మాట్లాడతా వుండగా నాకు గురయ్య గ్యేపకాని కొచ్చిండు.

"అవును గానీ నాగమామా! మన గురయ్య సచ్చిపొయ్యినాక ఆ రకంగా దరువేసే వోల్లెవురన్నా వుండారా కొచ్చెర్లకోటలో?" అనడిగినా.

"యాం జెప్పేదయ్యా! ఆడితోనే బోయె ఆ యిద్యాంతా. లేదు. కొచ్చెర్లకోట్లో అసుమంటి యిద్యా లేదు" యాన్నో ఆలోశన జేస్తా వుల్లలో మట్టిలో గీతలు గీస్తా అన్నాడు.

గురయ్య గుర్తుకి రాగానే నా మనసు గూడా సిటికిన పిల్ల మాదిరి యిరిగి పొయ్యింది.

* * *

యాకోబుది రావిగుంటపల్లె, కొచ్చర్లకోటలో వుండే తూరుపింటి కోటతాత కాడికి పెంపకానికి బొయ్యినాడు. ఇంగ కోట తాత యాకోబుని పెంచి పెద్దచేసి తన కూతుర్నే ఇచ్చి పెళ్ళిజేసినాడు. పలక వాయిచ్చే దాన్లో పదూల్ల మీన పైసెయ్యి యాకోబుది.

యాకోబు మందుగొట్టి కాకబెట్టిన డప్పు దీసుకుని సందలకాడ దరువేస్తా వుంటే ఆయన బార్య చెంచమ్మ నల్లని నడుమేసుకోని సిందులేస్తా వుండేది. ఈల్లద్దరినీ జూసి ఆకాసం మీన సందమామ బోమురిసిపోతా వుండేది.

కొన్నాల్లకి చెంచమ్మ కడుపున గురయ్య బుట్టినాడు. వాడు పేగుదెంచుకుని కేరుకేరున యేడస్తా వుంటే వాడి యేడుపులో గూడా యాకోబుకి డప్పు సప్పుడే యినొచ్చింది. కొడుకుని గూడా తనంతటి పనోడ్ని జెయ్యాలనుకున్నడు యాకోబు.

చెంచమ్మ పొంతకుండలోని వుడుకునీల్లు బానలో తొరిపి గురయ్యని కాల్లమీన పండేసుకోని ఈవురుద్దతా వుంటే,

యాకోబు బొద్రాయి కాడ నిలబడి దరువేస్తా కొడుకుని తలుసుకోని బోమురిసిపొయ్యేవోడు. బాల గురయ్య మాత్తరం చెంచమ్మ జోలపాట కన్నా యాకోబు గొట్టే డప్పు దరువుకే కమ్మంగ నిదురబట్టేది.

గురయ్యకి గునగునమంటా నడిసే వొయసొచ్చింది. తప తపా డప్పుగొట్టడం, చిర్రా, సిటికెన పుల్ల పట్టుకోడం తెలుసుకునే తెలివొచ్చింది. యాకోబు కొడుకుని, డప్పుని సెరో సేత్తో ఎత్తుకొనేవోడు. ఈరకంగా కొడుకుని పెల్లిల్లకీ, దేవర్లకీ తిప్పేవోడు. వోడు పాలుగావాలని యేడిస్తే ఆ తండ్రి సారాయి బట్టిచ్చేవోడు.

అట్టా గురయ్య ఉగ్గుల్తో సారాయి తాగడం కాన్నుంచి కుండల్తో తాగే దాకా వచ్చిందు. వొగి సుతో బాటు అలవాటు గూడా పెద్దదయ్యి తాగందే బతకలేనట్టు మారినాడు.

గురయ్య పలక వాయించడంలో పెద్ద పెద్దోల్లని గూడా మించిపోయినాడు. పదూల్ల ఆసాములు గురయ్య డప్పాట కోసం కబుర్లు పెడతా వుండేది. యాకోబు డప్పగొట్టడం సాలిచ్చుకున్నాడు. కొడుకు సంపాదన జేస్తా వుంటే కమ్మంగా సారాయి దాగి దిట్టంగ దిని పానుకునేది. కొడుకు డప్పగొ ట్టనుబోతే యెంటబొయ్యి రూపాయలు ఏరతా వుండేది. ఇంగ గురయ్య మాత్తరం దినమంతా సారాయి మత్తులో జోగేవోడు. వోడికి మత్తు దిగకుండా ఆసాములు మందు బోపిచ్చేవోల్లు.

గురయ్య డప్పాటంటే వూరువూరంతా మూగి పొయ్యేది. అమ్మోరి జాతరకి గురయ్య డప్ప యినిపియ్యకబోతే అమ్మోరికి శివాలెత్తవు.

ఆయేదు దేవీ నవరాత్తిల్లుకి గురయ్య డప్పాట వుండాదని వూరంతా దండోరా యేసినారు. ఆట సందకాడ మొదలయ్యింది. వూరంతా గుడి కాడ చుట్టూ దడిగట్టుకోని నిలబడినారు.

గురయ్య వుల్లుగ దాగి రొమ్ము పొగురుతో డప్పగొడతా కాల్లకి గజ్జెలు గట్టుకోని ఈర చిందు లేస్తా ఈరంగాలు దీస్తా వున్నదు. ఆ కులం ఈ కులం అనిలే. అందరూ బుజాలు బుజాలు రాసుకుంటా నిలబడ్డరు. ఆటకి అంటుంటదా? అంతుంటదా?

మాదిగ గురయ్యాటకి మనుసులంతా గంగ ఎర్రులెత్తి సప్పట్లు గొడతా జబ్బలు సరస్తా అరుస్తా వుండారు. ఆట మద్దెలో యాకోబొచ్చి నేల మీన డప్ప బెట్టినాడు. అంతే కళాగౌరవం దెలిసిన కుర్ర ఆసామీ దానిమీన కొత్త వంద రూపా యిల నోటు యిసిరినాడు. ఆ పచ్చనోటు డప్ప మీన పానుకోనుంది. ఆ నోటుని జూడంగనే గురయ్యకి గుండెలోనుంచి వూనకం వొచ్చింది. ఒక్కసారి గురయ్య వాల్లబ్బ సాయ జూసినాడు. అంతే. యాకోబు బరబరావొచ్చి నోటికి ముంత అందించినాడు.

గురయ్య గటగటా నీల్లమాదిరి సారాయి తాగి పులి మాదిరి తేపినాడు. డప్పను చిర్రా సిటికెన పుల్లతో పరుగులు దీయిస్తా ఆ వొంద రూపాయ లిచ్చిన ఆసామి వొంక జూసి ఖనేల్ : ఖనేల్‌బంటా దరువుతో దండాలు బెట్టినాడు. సుట్టూ నిలబడ్డ జనాలంతా మోరలెత్తిన గొడ్లమాదిరి నేలమీన డప్ప తట్టు వూరిపి బిగిచ్చి చూస్తా వుండారు.

పచ్చనోటు బెట్టిన డప్ప చుట్టూ గిరగిర తిరగతా రకరకాల దరువులేస్తా అలుపు లేకుండా సిందు లేస్తా వున్నాడు గురయ్య. వొల్లంతా సెమటలు బట్టి సారాయి వోసనేస్తా వుంది. అట్టా డప్పగొట్టు కుంటా నేలమీనకి వొంగి జణ జణ జణమంటూ పలక పగిలి పొయ్యేట్టుగా దరువేస్త వుంటే జరగ బొయ్యే ఇచిత్రం జూడాలని జనాలంతా ఆరాటంగా ఎదురుజూస్తా వుండారు. తప్పెట మోతకి గుండె లదిరిపోతా వుండయ్యి. దరువుల అదురుదెబ్బకి పచ్చనోటు పసిరిక పామ్మాదిరి జారుకుంటా నేలమీన బడింది. మట్టిమీన బడ్డ పచ్చనోటుని డప్పగొడతానే తలకాయొంచి నుదురుకి అంటి చ్చుకున్నాడు. అట్టనే జాగర్తగా పైకి లేచి నుదురు మీన్నుంచి రెప్పలమీనకి పచ్చ కాగితాన్ని కల్లజోడు మాదిరి ఎక్కిచ్చుకున్నాడు. అట్టనే రెప్పలకాన్నుంచి మీసాల కాడకిదెచ్చి నాలికతో పచ్చనోటు అందు కోని మునిపంటితో కరిసి పట్టుకున్నాడు. ఇదంతా దరువు ఆపకుండానే జేస్తా వుండాడు.

ఈ యిజ్యాలో గురయ్య మొనగాడు. కొత్తోల్లు చిత్తరబోతరుగానీ పాతోల్లకి దెలుసు గురయ్య పనితనం.


ఈ రకంగా కొన్నేల్లు గడిసిపాయినయ్యి. యాకోబు వొంటిమీన ముసలితనం మాసూళ్ళ కాలం మాదిరి వొచ్చిపడింది. ఇటుజూస్తే గురయ్య సారాయికి బానిసైనాడు. మత్తు దిగ కుండా సారాయి మీన సారాయి తాగుతున్నడు. వొల్లు లలివిగావడంలా! మనిసంతా వొణికిపోతా వుండాడు. తిండి తినడంలే! ముక్క ముట్ట డంలా! సారాయి వుంటే సాలు. మనిసేమో సెర్మం పోయిన దట్టెం మాదిరి తయారయ్యినాడు. ఖల్లు ఖల్లున దగ్గేది. అయినా సారాయి మాత్తరం మానలా!

ఆసాములిండ్లకి బొయ్యేది. కాల్ల మీన బడేది. యేదో వొకరకంగా డబ్బులెచ్చుకునేది. సారాయి పొట్టలో బోసుకునేది.

గురయ్య బక్కసిక్కిన గొడ్డు మాదిరి సీకిపోతా వుండాడు. ఎముకల గూడు మాదిరి కొడుకు యెండిపోతా వుంటే కొడుకుని జూసి యాకోబు కండ్లకి నీల్లు దెచ్చుకునేది. తను జేసిన సిగ్గుమాలిన అలవాటుకి కుమిలిపోతా వుండేది.

సారాయి అలవాటుబడ్డ గురయ్య రూపాయకి కూడా లోకువ గావాల్సొచ్చింది. వూర్లో పిల్లోల్లు రూపాయ, రెండ్రూపాయల నోట్లకి ఆశపెట్టి గుర య్యని డప్పాట ఆడిస్తా వుండారు.

ఒక సందకాడ బొడ్రాయి కాడ గురయ్యని డప్పాట ఆడమని ఆసాముల పిల్లోల్లు గలబా జేస్తున్నరు. గురయ్యకి ఈ మద్దెన డబ్బులు పుట్టడంలా! మునుపు మాదిరి పలక వాయించే దానికి చాతకావడంలా! సిటికెన పుల్ల గూడా కర్ర మాదిరి బరువైపొయ్యింది. డప్పె త్తను గూడా చాతగాడంలా! కానీ సారాయి గావాల! అది కడుపులో బడితే గానీ పేగులు సల్లబడవు.



వంద రూపాయలు దీసుకోని డప్పాట ఆడేవోడు. అయ్యాల రూపాయి కాడకి దిగజారినాడు. పగలంతా బ్రాయి కాడ కూసునేది. నాలుగయిదు రూపాయలు దొరికితే సారాయంగడికి బొయ్యేది. వుల్లుగా తాగి అన్నే బడిపొయ్యేది.

అయాల పెద్ద పండగ. వూర్లో అందరూ బోసంబరంగా వుండారు. గురయ్యకి మాత్తరం అన్ని రోజులూ వొక్కటే. ఆసాముల పిలకాయలు మట్టిరోడ్డు మీన గాలిపటాలు యెగరేస్తా వున్నారు. వోల్లల్లో వొకడొచ్చి "ఒరేయ్! గురయ్యా, డబ్బిలిస్తాము గానీ డప్పాట ఆడరా!" అని డబ్బాళ సూపిస్తున్నాడు.

ఇంగొకడొచ్చి అయిదు రూపాయల నోటు నేల మీన బారేసినాడు.

"అందుకోరా గురయ్యా! నాపల్తో ఎత్తుకోని రెప్పలమీన బెట్టుకోని నోటితో బట్టుకోవాల. కానియ్, కానియ్! అని తొందరజేస్తా వుండారు.

నిజానికి అయాల గురయ్య పానం బాగా లేదు. బువ్వదిని మూడు రోజులయ్యింది. కాల్లు సేతులు గుంజతా వుండయ్యి. గొంతు మండతా వుండాది. పొద్దుట్నించి సారా సుక్కబడలా!

ఇంగేం జేస్తడు? మెత్తబడ్డ ఆవు మాదిరి లేసి యింటికి బొయ్యి డప్పు కాకబెట్టుకొచ్చినాడు. వొద్దని అడ్డం జెప్పను వాయిన ఎవ్వడోబోయె! గంజిగాసి పొయ్యను గూడా ఆడదిక్కు లేకపాయె!

ఆసాముల పిలకాయలు జనాల్ని కూడబెట్టి కేరింతలు గొడతా వుండారు.

గురయ్యకి మాత్తరం జెరంతో వొల్లు రెల్లుగడ్డి మాదిరి వూగిపోతా వుంది. కండ్లు మనకలు గమ్ముతుండాయి. గుండెల్లో నుంచి దగ్గు తన్నుకొస్తా వుంది. లోపల అయిదు రూపాయిల కాగితం ఆసపెడతా వున్నా, ఒల్లు గిలక మాదిరి గ్గిరువ తరగతి వుంది.

అయినా గురయ్య డప్పు వాయిస్తానే వున్నాడు. జనాలు పెద్దగా కేకలు పెడతా సప్పట్లు గొడతా ఎగరతా వుండారు.

గురయ్య వొక్కసారి పెద్దంగా ఖల్లు ఖల్లున దగ్గి కూలబడిపోయినాడు. దగ్గతానే బొచ్చెలు బొచ్చెలు నెత్తురు కక్కుకున్నాడు. డప్పు మీన నెత్తురు చిమ్మి ఎర్రంగా మరీదు మాదిరిగా వుంది. నెత్తురంటిన అయిదు రూపాయిల కాయితం నొసలు మీన అతుక్కోనుంది.

గురయ్య రెప్పలెత్తి ఆ నోటు అందుకునే దానికి పెయత్నం చేస్తున్నడు. అయితే వల్ల గావటంలే! రెప్పలు బరువుగా మూతలు బడతా వున్నయ్యి. రెండు మూడుసార్లు రెప్పలు టపటపా కొట్టుకోని మూతబడిపోయినయ్యి.

జనాలంతా బిత్తరపొయ్యి సూస్తున్నరు. గురయ్య రెప్పలు మాత్తరం ఎంచేపుటికీ పైకి లెయ్యడంలే!

43వ పేజీ తరువాయి

# తెరముందు భాగోతాలు



ఒక వ్యాసకర్త వాళ్ళ నాన్న దేశభక్తి గురించి రాసేడు– 'ఓసారి సినిమా అయిపోయాక జాతీయ గీతం వచ్చినప్పుడు మా నాన్న లేచి నుంచొన్నాడు. మా అమ్మ లేవబోయి కాలు తిమ్మిరెక్కడంవలన మెట్లమీద దొర్లిపడింది. వెళ్ళి ఆమెను లేవనెత్తాలి. కానీ జాతీయగీతం పట్ల చూపవలసిన గౌరవం కూడా ఉందిగా! దేశం పట్ల బాధ్యత, భార్యపట్ల బాధ్యత రెండిటి మధ్య సంఘర్షణ జరిగింది మా నాన్నకు. చివరకు దేశభక్తే జయించి పెదవి కొరుక్కుంటూ నిలబడే ఉన్నాడు' పాట అయిపోగానే వెంగున అమ్మదగ్గరకు చేరాడు'.

ఓసారి నేను అలాగే నిలబడి ఉంటే ఓ పల్లెటూరతను తలుపు దగ్గరకి వెళుతూ నన్ను ఎగాదిగా చూసి, తెరమీదకోసారి చూసి "ఇంకేటి సూసావ్? అది జండా" అనేసి వెళ్ళిపోయాడు. సినిమా అర్థం కాకుండా చూడ్డానికి వచ్చేవాళ్ళ గురించి కూడా ఒకతను ప్రస్తావించాడు'–

'ఏపీ హాల్' చిత్రం మొదట్లో 'ఉడీ ఎలెన్ వచ్చి ప్రేక్షకుల నుద్దేశించి మాట్లాడతాడు. నా వెనక్కాల ఓ రైతు ముందుకు వంగి, "ఆడెవడయ్యా, వెధవ వాగుడూ వాడూ, తప్పకోమను, నేను సినిమా చూడ్డానికి వచ్చానని చెప్పు" అన్నాడు.

'ఏకాంతం' కోరే ప్రేయసీ ప్రియులు సినిమాహాలు ఎంచుకొంటారని జగమంతా తెలుసు. చీకటి, చుట్టూ జనాలున్నా సినిమాను తదేకంగా చూస్తుంటారు. వీరి చిలిపిచేష్టలు వీరు చేసుకోవచ్చు. తనకిష్టమయిన వారిని సినిమాకు తెసుకెళ్ళడం, వారు ఎంతవరకు సాన్నిహిత్యాన్ని అనుమతిస్తారో ప్రయత్నించి చూడడం పరిపాటి. ఒక వ్యాసకర్త తమ స్కూలు రోజులనాటి ముచ్చట్లను వివరించాడు–

'మేం హైస్కూల్లో ఉండగా గర్ల్‌ఫ్రెండ్‌తో సినిమాహాల్లో ఏ వరసలో కూచున్నారో దాన్ని బట్టి వాళ్ళిద్దరి మధ్యగల సాన్నిహిత్యాన్ని అంచనా వేసేవాళ్ళం. 'ఏ' నుంచి 'ఎఫ్' వరసరో కూచుంటే దానర్థం వాళ్ళిద్దరూ ఈమధ్యే పరిచయమయ్యారని. 'ఎఫ్' నుండి 'ఎం' వరకు అంటే పెదాలు పూర్తిగా తెరవకుండా పైపైనే ముద్దులాడుకుంటున్నారని, 'ఎం' నుండి 'పి' వరకు అంటే గాఢంగా ముద్దు పెట్టుకుంటున్నారని, 'పి' నుండి 'వి' వరకు అంటే బ్రా లోపలి దాకా చెయ్యి వెళుతోందని, 'వి' తర్వాత జరిగేవాటి గురించి వాళ్ళు చెప్పేవి మాత్రం నేను నమ్మువాణ్ణి కాదనుకోండి!

ఇటువంటి మెట్లు చాలా ఎక్కివచ్చి సినిమాహాల్లో శృంగారం నెరపే అలవాటుగల జాణల గురించి ఒక హాలు మేనేజరు ఆ పుస్తకంలో ఇచ్చిన సమాచారంతో ఈ వ్యాసం ముగిస్తాను.

'... నేను ఒక హాల్లో మేనేజరుగా పనిచేసేటప్పుడు మెట్లు తనిఖీ చేస్తుండగా కార్పెట్‌మీద ఆడవాళ్ళు లోపల వేసుకొనే లాగూ కనబడింది. దాన్ని తీసుకెళ్ళి బాగా అతుక్కుపోయి కూచున్న ఓ జంటలోని అమ్మాయి దగ్గరకెళ్ళి మర్యాదగానే "ఈ పాంటీ మీదా?" అని అడిగేను. ఆ అమ్మాయి కూడా ఏమాత్రం బింకం చెడకుండా "అబ్బే, నాది నా హేండ్‌బాగ్‌లోనే ఉందిగా" అంది'.

–ఎమ్.బి.ఎస్.ప్రసాద్